



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

EVENING EDITION
పేజీలు: 02
www.suryaa.com
[redacted] PM


## [redacted] వార్

ELECTION SPECIAL 2023

# విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది చిన్నారులకు గాయాలు

విశాఖపట్నంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నగరంలోని సంగం-శరత్ థియేటర్ దగ్గర లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా.. ఒకరి పరిస్థితి విషంగా ఉంది. రోడ్డు దాటే క్రమంలో ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం.. స్కూల్ విద్యార్థుల ప్రాణాల మీదకు తెచ్చింది. జంక్షన్‌లో స్పీడ్‌గా వస్తున్న లారీని గమనించకుండా.. వేగంగా రోడ్డు దాటే ప్రయత్నం చేశాడు ఆటో డ్రైవర్. దీంతో ఆటో వెళ్లి లారీని ఢీకొని పల్టీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 8 మంది విద్యార్థులు ఉన్నారు. రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో ప్రమాదం దృశ్యాలు రికార్డయ్యాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. సమయం దాటిన తర్వాత లారీ రోడ్డుపైకి రావడం నిబంధన ఉల్లంఘన కాగా..ఆటో డ్రైవర్ వేగం కూడా ప్రమాదానికి కారణంగా కనిపిస్తోంది. ప్రమాదం దృశ్యాలు చాలా హృదయవిదారకంగా ఉన్నాయి. రక్తం కారుతున్న గాయాలతో పిల్లలు బోరున ఏడుస్తూ రోడ్డుపై పడి ఉండటం చూసిన వారి హృదాయాలు చలించి పోయాయి.. ఈ ప్రమాదంలో ఆరుగురు పిల్లలు గాయపడ్డారు. కాగా.. ఈ ఘటనపై డీసీపీ శ్రీనివాసరావు మాట్లాడారు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. 4 విద్యార్థులకు గాయాలయ్యాయని.. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఆటోలో పరిమితికి మించి విద్యార్థులు ఉన్నారని.. ఇది కూడా ప్రమాదానికి కారణమైందని శ్రీనివాసరావు తెలిపారు. ఆటోలో పిల్లలను పంపే తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని.. చివరి నిమిషంలో వేగంగా వెళ్లడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని డీసీపీ వివరించారు.






## అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్న పోలీసులు..

### ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపణ

సూర్యాపేట జిల్లాలోరి హుజూర్ నగర్ నియోజకవర్గంలో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. హుజూర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తన ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న కొందరిని కిడ్నాప్ చేశారని పోలీసులకు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై పోలీసులు సరైన రీతిలో స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో తన ఎన్నికలను నిర్వహించేందుకు ఓ సంస్థకు బాధ్యతలకు అప్పగించామని.. ఆ సంస్థ ప్రతినిధులు విధి నిర్వహణలో ఉండగా వారిని ఎమ్మెల్యే కిడ్నాప్ చేశారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు నిన్న ( మంగళవారం ) కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి రాత్రి హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదు పై పోలీసులు స్పందించడం లేదని ఆరోపిస్తూ ఉత్తమ్ కుమార్ రెడ్డి పోలీస్ స్టేషన్ ముందు నిరసనకు దిగారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని.. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే, ఇప్పటికే హుజూర్ నగర్ లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్ సర్కార్ పై ఆయన విమర్శలు గుప్పిస్తున్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇప్పుడు చేసిన తప్పులకు అప్పుడు శిక్ష పడుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.




## నాగ చైతన్య తండేల్ ఫస్ట్ లుక్

అక్కినేని నాగ చైతన్య హీరోగా గీతా ఆర్ట్స్2 సంస్థ నిర్మిస్తున్న సినిమాకు 'తండేల్' టైటిల్ ఖరారు చేశారు. ఈ రోజు ఫస్ట్ లుక్ విడుదల చేశారు.

# ఓపెన్‌ఏఐలో కొత్త ట్విస్ట్..

## సీఈఓగా తిరిగి రానున్న శామ్ ఆల్ట్‌మన్

చాట్‌జీపీటీ సృష్టికర్త శామ్ ఆల్ట్‌మన్ తొలగింపుతో ఓపెన్‌ఏఐలో నెలకొన్న నాటకీయ పరిణామాలకు తెరపడింది. ఆల్ట్‌మన్ తిరిగి ఓపెన్‌ఏఐకి రానున్నారు. సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే కంపెనీకి కొత్త బోర్డు సైతం రానున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. ఈ మేరకు ఓ ఒప్పందం కుదిరినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని ఆల్ట్‌మన్ సైతం ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు. ఆల్ట్‌మన్ తొలగింపు తర్వాత అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

ఓపెన్‌ఏఐలో అతిపెద్ద వాటాదారుగా ఉన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సైతం ఆయనకు మద్దతుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అలాగే కంపెనీలో చాలా మంది ఉద్యోగులు రాజీనామా చేస్తామని హెచ్చరించినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. మరోవైపు ఇన్వెస్టర్లు సైతం ఆల్ట్‌మన్‌ను తిరిగి తీసుకురావాలని కోరినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. సేల్స్‌ఫోర్స్ మాజీ కో-సీఈఓ బ్రెట్ టేలర్ అధ్యతన అమెరికా మాజీ ట్రెజరీ సెక్రటరీ లారీ సమ్మర్స్, కోరా సీఈఓ ఆడమ్ డీ-ఏంజిలోతో కూడిన కొత్త బోర్డు ఏర్పాటు కానున్నట్లు ఓపెన్‌ఏఐ వెల్లడించింది. తాజా నిర్ణయంపై ఆల్ట్‌మన్ స్పందిస్తూ.. ఓపెన్‌ఏఐ అంటే తనకెంతో ఇష్టమన్నారు. కంపెనీ లక్ష్యాన్ని, దాని కోసం శ్రమిస్తున్న బృందాన్ని నిలిపి ఉంచడం కోసమే తాను గతకొన్ని రోజులుగా



నిర్ణయాలు తీసుకున్నానని తెలిపారు. ఓపెన్‌ఏఐకి తిరిగొచ్చి మైక్రోసాఫ్ట్‌తో బలమైన బంధాన్ని నెలకొల్పడానికి ఆసక్తిగా ఉన్నానని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఓపెన్‌ఏఐ తొలగింపు తర్వాత ఆల్ట్‌మన్‌ను తమ కొత్త ఏఐ పరిశోధన బృందంలోకి తీసుకుంటున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఓపెన్‌ఏఐతో తమ బంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఆల్ట్‌మన్ తిరిగి ఓపెన్‌ఏఐకి రావడాన్ని తాను స్వాగతిస్తానని నాదెళ్ల పలు ఇంటర్వ్యూల్లో తెలిపారు. వివిధ వర్గాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ఆల్ట్‌మన్‌ను తిరిగి తీసుకురావడానికి తొలుత ఓపెన్‌ఏఐ చేసిన యత్నాలు విఫలమైన విషయం తెలిసిందే. బోర్డు తొలగింపు సహా తనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని ఆల్ట్‌మన్ షరతులు విధించినట్లు వార్తలు వచ్చాయి. ఎట్టకేలకు ఆయన డిమాండ్ల మేరకు.. బోర్డు పునర్‌నిర్మాణం జరిగినట్లు తాజా పరిణామాలతో స్పష్టమైంది.

### ఇది తొలి అడుగు..

ఆల్ట్‌మన్ పునరాగమనంపై సత్య నాదెళ్ల స్పందించారు. ఓపెన్‌ఏఐ బోర్డులో మార్పులు తమను ఉత్సాహపరిచాయన్నారు. మరింత స్థిరమైన, ప్రభావవంతమైన పాలనా విధానాలకు అవసరమైన తొలి అడుగు ఇదేనని తెలిపారు. దీనిపై ఆల్ట్‌మన్, బ్రాక్‌మన్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఓపెన్‌ఏఐ నాయకత్వంతో పాటు వారికి కంపెనీలో కీలక స్థానం ఉంటుందని తెలిపారు. తద్వారా సంస్థ లక్ష్యం నిరాటంకంగా ముందుకు సాగుతుందన్నారు. తమ భాగస్వాములు, కస్టమర్లకు విలువతో కూడిన ఏఐని అందించేందుకు ఓపెన్‌ఏఐతో మైక్రోసాఫ్ట్ బంధం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు.ఽ



## ఇజ్రాయెల్-గాజాలకు భారీ సాయం ప్రకటించిన మస్క్

ట్విట్టర్ (X) అధినేత ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో మస్క్ కీలక విషయాన్ని ప్రకటించారు. యుద్ధంలో అతలాకుతలమైన ఇజ్రాయెల్-గాజాలోని ఆసుపత్రులకు భారీ సాయం అందిస్తామని తెలిపారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి సంబంధించిన ప్రకటనలు, చందాల నుంచి వచ్చే మొత్తం ఆదాయాన్ని అక్కడి ఆసుపత్రులకు విరాళంగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. మస్క్ నిర్ణయాన్ని నెటిజన్లు అభినందిస్తున్నారు.



## ఆడబిడ్డను బద్నాం చేస్తున్న బీజేపీని ఓడించాలి..

## రోడ్ షోలో మంత్రి కేటీఆర్

కంటోన్మెంట్ అభివృద్ధి బాటలో మరింత ముందుకు సాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కేటీఆర్ కోరారు. మంగళవారం రాత్రి కంటోన్మెంట్ సెగ్మెంట్ పరిధి అన్నా నగర్, పికెట్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ పరిధిలోని భూమికి బదులు మరోచోట ఇస్తామంటే కేంద్రంలోని బీజేపీ సర్కారు ఒప్పుకోవడం లేదని మండిపడ్డారు. కేంద్రం సహకరించకున్నా కంటోన్మెంట్ వాసులకు ఫ్రీ వాటర్ స్కీమ్‌ను అందిస్తున్నామని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌తో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న వివాదరహితుడని.. ఆయన కుమార్తె లాస్య నందితపై బీజేపీ నేతలు బురదజల్లుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దిక్కుమాలిన వీడియోలతో దుష్ప్రచారం చేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. కంటోన్మెంట్ ప్రజల బాగోగులు పట్టని బీజేపీకి డిపాజిట్ దక్కకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. రోడ్ షోలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అభ్యర్థి లాస్య నందిత, సీనియర్ నేత ఎంఎన్ శ్రీనివాస్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్ ఉన్నారు.



## తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, భద్రాద్రి అభివృద్ధికి తామే భరోసా ఇస్తున్నామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారు చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలంలలో రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. తమ హయాంలో నిర్మించిన బ్రిడ్జిలు, తాలిపేరు ప్రాజెక్టు ఆధునీకరణ పనులు, విద్యుత్ సౌకర్యం, కరకట్టల నిర్మాణాలను వివరించారు. రాముడినే మోసం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో పదేళ్ల కాలంలో ఆయన కుటుంబంలో తప్ప ఏ ఒక్క నిరుద్యోగికి ఉద్యోగం రాలేదన్నారు. మరోసారి పొదెం వీరయ్యను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ రూ.వంద కోట్లు పంపించిండు**

కాంగ్రెస్, టీజేఎస్ మద్ధతుతో కొత్తగూడెంలో సీపీఐ తరుపున పోటీ చేస్తున్న కూనంనేని సాంబశివరావును ఓడించేందుకు కేసీఆర్ కొత్తగూడెం నియోజకవర్గానికి రూ. వంద కోట్లు పంపించారని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.



## నేడు వర్చువల్ జీ20 సదస్సు..

### అధ్యక్షత వహించనున్న ప్రధాని మోడీ

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ఢిల్లీలో నేడు వర్చువల్ జీ20 సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా పాల్గొంటారని క్రెమ్లిన్ తెలిపింది. ఈ వర్చువల్ G20 లీడర్స్ సమ్మిట్ సాయంత్రం 5:30 నుండి జరుగుతుంది. వర్చువల్ సమ్మిట్‌లో అనేక ప్రధాన అంశాలు చర్చించబడతాయి. ఇది సెప్టెంబరులో జరిగే న్యూఢిల్లీ సమ్మిట్ ఫలితాలు, కార్యాచరణ పాయింట్లను మరోసారి గుర్తు చేస్తుంది. అప్పటి నుండి పరిణామాలను సమీక్షిస్తుంది. ఈరోజు వ్లాదిమిర్ పుతిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే జీ20 సదస్సులో పాల్గొంటారని క్రెమ్లిన్ అధికారిక ప్రకటనలో తెలిపింది. సమ్మిట్‌లో పాల్గొనేవారు 2023లో గ్లోబల్ ఎకానమీ, ఫైనాన్స్, క్లైమేట్ ఎజెండా, డిజిటలైజేషన్ ఇతర అంశాలపై చర్చిస్తారు. ప్రధాని మోడీ అధ్యక్షతన వర్చువల్ జీ20 సమ్మిట్ నిర్వహించనున్నట్లు జీ20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు.

## దేశవ్యాప్తంగా తగ్గిన ఉద్యోగాలు..

## భారీస్థాయిలో పెరిగిన నిరుద్యోగం




బీజేపీ కేంద్ర ప్రభుత్వ హయాంలో ఉద్యోగ కల్పన పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు అటుంచితే.. లక్షలాది సంఖ్యలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను కూడా భర్తీ చేయడంలో విఫలమైంది. దీంతో దేశంలో నిరుద్యోగం భారీస్థాయిలో పెరిగిపోయింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) సోమవారం విడుదల చేసిన గణాంకాలు ఉద్యోగ లేమిని స్పష్టం చేశాయి. సెప్టెంబర్‌లో సంఘటిత రంగంలో ఉద్యోగాల కల్పన ఆరు నెలల కనిష్ఠానికి చేరిందని పేర్కొన్నది. ఆగస్టు నెలలో 9,53,092 మంది కొత్త సబ్‌స్క్రైబర్లు నమోదు కాగా, అది సెప్టెంబర్‌లో 6.45 శాతం పడిపోయి 8,91,583 మంది సబ్‌స్క్రైబర్లు నమోదయ్యారని వెల్లడించింది. కొత్త ఈపీఎఫ్ సబ్‌స్క్రైబర్లలో మహిళల శాతం కూడా దారుణంగా పడిపోయింది. ఆగస్టులో 26.12 శాతం (2,48,980) ఉండగా, సెప్టెంబర్‌లో 25.3 శాతానికి(2,26,392 మంది) దిగజారింది. మరోవైపు 18-28 ఏండ్ల మధ్య వయస్కుల భాగస్వామ్యం స్వల్పంగా ఒక్క శాతం పెరిగింది. కాగా, భారతదేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరుకొన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) నివేదిక కూడా ఇటీవల వెల్లడించడం గమనార్హం.



## మైనార్టీలను ఆదుకున్న ఏకైక వ్యక్తి కేసీఆర్

### హోం మినిస్టర్ మహమూద్ అలీ

కేసీఆర్ అధికారంలో ఉంటేనే మైనార్టీలకు మంచి జరుగుతుందని, ఇప్పటి వరకు మైనార్టీలను ఆదుకున్నది ఒక్క కేసీఆరే అని హోం మినిస్టర్ మహ్మద్ అలీ చెప్పారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో ఎంఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మైనార్టీల ఆత్మీయ సమేళనంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజల బాగు కోసం కేసీఆర్ ఏవిధంగానైతే ఆలోచన చేస్తాడో అదే విధంగా పరకాల నియోజకవర్గ ప్రజల కోసం ధర్మారెడ్డి అదే విధంగా ఆలోచిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ మైనార్టీల అభ్యున్నతికి, వారి సంక్షేమం కోసం పాటు పడ్డారన్నారు.

సూర్య www.suryaa.com
EVENING EDITION 4PM



# సిమ్రాన్ కౌర్ బోల్డ్ ఫోటో షూట్

బాలీవుడ్ నటి సిమ్రాన్ కౌర్ తన బోల్డ్ ఇమేజ్ కోసం సోషల్ మీడియాలో నిరంతరం చర్చలు జరుపుతూనే ఉంటుంది.సిమ్రాన్ కౌర్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా హాట్ పిక్చర్స్ షేర్ చేసింది.సిమ్రాన్ కౌర్ అభిమానులు కూడా ఆమె బోల్డ్ ఫోటో షూట్ చూసి పిచ్చెక్కి పోయారు.సిమ్రాన్ ఈ చిత్రాలలో హాట్ ఫిగర్‌ని చాటుకుంది సిమ్రాన్ కౌర్ తన హాట్ పిక్చర్స్ ని షేర్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో నిప్పులు చెరిగింది.అభిమానులు కూడా ఆమె చిత్రాలపై కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. బోల్డ్ అంచనాలపై నిరంతరం చర్చ జరుగుతోంది.

## నెలన్నర పాపకు 40 వాతలు పెట్టిన నర్సు



న్యుమోనియాతో బాధపడుతున్న నెలన్నర పాపకు చికిత్స పేరుతో ఓ గ్రామ నర్సు వేడి ఇనుప కడ్డీతో 40 వాతలు పెట్టింది. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచే సుకుంది. ఈ ఘటన ఈ నెల 4వ తేదీన షాదోల్ జిల్లాలోని హార్ది గ్రామంలో చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై దర్యాప్తు కొనసాగు తోందని అధికారులు తెలిపారు. ఈ దారుణానికి కారకులైన దాయి గ్రామ నర్సు బూటీ బాయి బాయిపై కేసు నమోదు చేశారు.



# కేరళ, తమిళనాడుకు భారీ వర్ష సూచన..

### అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కేరళ, తమిళనాడు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు హెచ్చరికలు చేసింది. రెండు రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు రాష్ట్రాలతోపాటు కోస్తా ఆంధ్ర ప్రదేశ్, రాయలసీమ, యానాంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.నేడు (బుధవారం), రేపు (గురువారం) కేరళలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఇక తమిళనాడు, పుదుచ్చేరిలో నేడు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. వాతావరణ విభాగం హెచ్చరికలతో కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ముందు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. మరోవైపు తమిళనాడులోని 10 జిల్లాల్లో రానున్న రెండు రోజుల్లో అడపాదడపా వర్షాలు కురుస్తాయని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల కారణంగా పుదుచ్చేరి, కారైకల్‌లోని పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. మరోవైపు కేరళలో ఇప్పటికే గణనీయమైన వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. పతనంతిట్ట, తిరువనంతపురం జిల్లాల్లో వరుసగా 7 సెంటీమీటర్లు, 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.



## నేడు రాష్ట్రంలో పలువురు బీజేపీ జాతీయ నేతల ప్రచారం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. ప్రచారానికి మరో నాలుగు రోజుల సమయం ఉండటంతో ఇప్పటికే అన్ని పార్టీలు ప్రచారంలో స్పీడ్ పెంచాయి. అటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పిస్తూ ప్రచారంలో దూకుడు పెంచింది. ఇందులో భాగాంగానే ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో పలువురు బీజేపీ జాతీయ నేతల ప్రచారం చేయనున్నారు. ఇవాళ సాయంత్రం 5 గంటలకు భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ దర్శించుకోనున్నారు. ఇక, 6 గంటలకు చార్మినార్ బెలా క్రాస్ రోడ్ లో బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. అలాగే, 7 గంటలకు ముషీరాబాద్ చౌరస్తాలో బీజేపీ నిర్వహిస్తున్న బహిరంగ సభలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ మాట్లాడ నున్నారు. దీంతో పాటు బెంగళూర్ సౌత్ ఎంపీ తేజస్వీ సూర్య సైతం పలు చోట్ల ప్రచారం చేసేందుకు తెలంగాణకు వచ్చారు. మరో వైపు ఉత్తర ప్రదేశ్ బీజేపీ ఎంపీ, నటుడు రవి కిషన్ పఠాన్ చెరువు, కుత్బుల్లాపూర్, రాజేంద్ర నగర్ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తుండగా.. కేంద్ర మంత్రి అర్జున్ ముండా వర్ధన్నపేట, స్టేషన్ ఘనపూర్ లో ప్రచారం నిర్వహించేందుకు వస్తున్నారు. అలాగే, వరంగల్ లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఇక, జహీరాబాద్ లో ఎన్నికల ప్రచారం లో కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప పాల్గొనున్నారు. మరో వైపు మల్కాజ్ గిరి లో ఇంటింటి ప్రచారంలో తమిళ్ నాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాల్గొననున్నారు.



## నెలకు రూ.5వేలు.. మంత్రి కీలక ప్రకటన

దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని 8వేల దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద త్వరలోనే ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఇస్తామని అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా 59 మంది గ్రేడ్ 3 ఈవోల నియామకం చేపట్టగా అందులో 54 మందికి అలాట్మెంట్ కూడా ఇచ్చామని అన్నారు. రాష్ట్రంలోని రూ.539 కోట్ల సీజీఎఫ్ నిధులతో దేవాలయాల పునరుద్ధరణ, కొత్త దేవాలయాలను నిర్మిస్తున్నామన్నారు.

## ఆర్మీ ఉద్యోగ ర్యాలీలో తొక్కిసలాట.. 37 మంది మృతి



రిపబ్లిక్ ఆఫ్ కాంగో రాజధాని బ్రజ్జావిల్లేలోని స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ సందర్భంగా రాత్రిపూట జరిగిన తొక్కిసలాటలో 37 మంది మరణించారు. ప్రముఖ వార్తా సంస్థ AFP మంగళవారం ఈ వార్తను ప్రచురించింది. రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని మిలిటరీ స్టేడియంలో పెద్ద సంఖ్యలో యువకులు రిక్రూట్‌మెంట్ అప్పీల్ కోసం వచ్చిన తర్వాత జరిగిన తొక్కిసలాటలో కనీసం 37 మంది మరణించారని అధికారులు మంగళవారం తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో పనిని అందించే కొన్ని సంస్థలలో ఒకటైన యువకులు సైన్యంలో చేరాలని కోరుకోవడంతో గత వారం రోజులుగా ప్రతిరోజూ రిక్రూట్‌మెంట్ సెంటర్‌ల వెలుపల భారీ క్యూలు ఏర్పడ్డాయి. మొత్తం 1,500 ఖాళీలు మాత్రమే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రతిరోజూ సుమారు 700 మంది నమోదు చేసుకున్నారు. ప్రధానమంత్రి కార్యాలయ సంక్షోభ విభాగం మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, అత్యవసర సేవల ద్వారా 37 మంది మరణించారని, చాలా మంది గాయపడినట్లు నిర్ధారించబడింది.




## ఐసీసీ కీలక నిర్ణయం.. ఆలస్యం అయితే 5 పరుగుల పెనాల్టీ!

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో వేగాన్ని పెంచేందుకు ప్రయోగాత్మకంగా 'స్టాప్ క్లాక్'ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఓవర్ పూర్తయిన 60 సెకన్లలో లోపు తర్వాతి ఓవర్‌ను ఆరంభించడంలో ఫీల్డింగ్ జట్టు ఒక ఇన్నింగ్స్‌లో మూడోసారి విఫలమైతే.. ఆ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధించబడుతుంది. ఈ స్టాప్ క్లాక్ పురుషుల వన్డే, టీ20 క్రికెట్లో మాత్రమే అమలు చేయబడుతుంది. 6 నెలల పాటు ప్రయోగాత్మకంగా ఈ స్టాప్ క్లాక్‌ను ఉపయోగించాలని ఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. 'పురుషుల వన్డే, టీ20 క్రికెట్లో 2023 డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ప్రయోగాత్మకంగా స్టాప్ క్లాక్‌ను ఉపయోగించాలని సమావేశంలో నిర్ణయించారు.



## టీ20 మ్యాచ్.. స్టేడియం వద్ద 2 వేల మంది పోలీసులు

వైజాగ్ వేదికగా గురువారం భారత్, ఆస్ట్రేలియా మొదటి టీ20 మ్యాచ్ జరగనుంది. వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మ్యాచ్ ఆరంభం కానుంది. దీంతో స్టేడియం వద్ద మూడు అంచెల భద్రతను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్టేడియం వద్ద రెండు వేల మంది పోలీసులు ఉండనున్నారు. ప్రేక్షకులను సాయంత్రం 5 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు. మ్యాచ్ నేపథ్యంలో పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నారు.




## స్విగ్గీ, జొమాటోలకు రూ.1000కోట్లకు జీఎస్టీ నోటీసులు

ఇన్‌స్టంట్ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ-జొమాటో కష్టాలు తీరడం లేదు. ఇటీవల స్విగ్గీ-జోమాటో రూ.500 కోట్ల జీఎస్టీ నోటీసును అందుకుంది. స్విగ్గీ-జొమాటో డెలివరీ ఫీజు పేరుతో కస్టమర్ల నుండి కొంత డబ్బు వసూలు చేస్తుంది. ఇప్పుడు ఈ డబ్బుకు సంబంధించి ట్యాక్స్ ఆఫీసర్, ఫుడ్ డెలివరీ యాప్ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ డెలివరీ ఫీజు విషయంలో దాదాపు రూ. 1000 కోట్ల వరకు వాటా ఉంది. 'డెలివరీ ఛార్జ్' అనేది ఇంటింటికీ ఆహారాన్ని డెలివరీ చేయడానికి వెళ్లే డెలివరీ ఏంజెట్లకు ఇచ్చే ఖర్చు తప్ప మరొకటి కాదని ఫుడ్ అగ్రిగేటర్లు జొమాటో మరియు స్విగ్గీ చెబుతున్నాయి. కంపెనీలు ఆ ధరను కస్టమర్ల నుండి సేకరించి, డెలివరీ భాగస్వాములకు అందజేస్తాయి. అయితే దీనికి పన్ను అధికారులు ఏకీభవించడం లేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ కేసులో రెండింటికీ సంబంధించి దాదాపు 1000 కోట్ల రూపాయల వాటా ఉంది. జొమాటో, స్విగ్గీకి జీఎస్టీ అధికారుల నుండి ఒక్కో కంపెనీకి రూ. 500కోట్ల నోటీసులు అందాయి. స్విగ్గీ, జొమాటో ఈ డెలివరీ రుసుమును వసూలు చేసి తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయని పన్ను అధికారులు భావిస్తున్నారు. జొమాటో, స్విగ్గీ తమ కస్టమర్‌లకు ఫుడ్ డెలివరీని అందించడం ప్రారంభించినప్పటి నుండి డెలివరీ ఛార్జీలుగా సేకరించిన మొత్తంపై 18శాతం పన్ను విధించినట్లు, ఆయా కంపెనీలు ఒక్కొక్కటి రూ. 500 కోట్లు చెల్లించాలని కోరినట్లు సోర్సెస్ చెబుతున్నాయి. ఈ విషయమై ఎకనామిక్ టైమ్స్ స్విగ్గీ-జొమాటోను ప్రశ్నించగా.. వారి వైపు నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.



# సారా అలీ ఖాన్ హాట్ లుక్స్

బాలీవుడ్ నటి సారా అలీఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త ఫోటోలను పోస్టు చేసింది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఆమె గోవా వెళ్లింది. తన రూమ్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్ సమీపంలో దిగిన ఫోటోలను అప్‌లోడ్ చేసిందామె. ఆ ఫోటోలకు పువ్వులు, హార్ట్ ఎమోజీలను యాడ్ చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీల్లోనూ మరికొన్ని ఫోటోలను షేర్ చేసింది. స్విమ్‌వియర్ డ్రెస్సులో ఉన్న ఫోటోల్లో సారా ఫుల్ క్రేజీగా కనిపిస్తోంది. ఆ ఫోటోల్లో క్లోజప్ షాట్స్ కూడా ఉన్నాయి.